

# నవభూమి

## కరీంనగర్

అనుబంధం

08 మే,2025 గురువారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


### ఇందిరమ్మ ఇళ్ల

# మంజూరులో జాప్యం..



**పెద్దపల్లి -నవభూమి:** ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగు తున్నది. పథకాన్ని ఆరంభించి మూడు మాసాలు గడుస్తున్నా లబ్ధిదారుల ఎంపిక ఇంకా కొలిక్కి రాలేదు. దీంతో ఇళ్లు ఎప్పుడు మంజూరు చేస్తారా అని అర్హులైన వారు ఎదురు చూస్తున్నారు. మండలానికి ఒక గ్రామంలో ఇళ్లు మంజూరు చేసింది కానీ మిగతా గ్రామాలు, పట్టణాల్లో ఇళ్లు మంజూరు చేయక పోవ డంతో అనేక మంది అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసేం దుకు మంచి ముహూర్తాలు పోతున్నాయని అర్హులు ఆందోళన చెందుతున్నారు.గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూముల ఇళ్ల పథకాన్ని తీసుక రాగా, అది ఆశించిన మేరకు ముందుకు సాగ లేదు. దీంతో అనేక మంది పేదల సొంతింటి కల నెరవేరలేదు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఇంది రమ్మ ఇళ్ల పథకాన్ని తీసుక వస్తామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి ఉచితంగా 5 లక్షల రూపాయలు అంద జేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించింది. ఈ ఇళ్లను సొంత ఇంటి స్థలం ఉన్న వారికే మంజూరు చేయాలని ప్రభుత్వం పేర్కొంది. గ్రామసభల్లో ఇంది రమ్మ ఇళ్ల కోసం జిల్లాలో 1,85,404 దరఖాస్తులు వచ్చాయి. ఈ పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను, ప్రత్యేకించి ఇందిరమ్మ యాప్‌ను రూపొందించింది. గత ఏడాది అక్టోబర్, నవంబర్ మాసాల్లో గ్రామాల్లో, మున్సిపాలి టీల్లో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి సర్వే చేశారు. ఫొటోలు తీసి, వారి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఈ ఏడాది జనవరి 26న ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం, కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆరంభించింది. మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆయా పథకాలకు ఎంత మంది అర్హులు ఉన్నారో వారందరికీ ఆ పథకాలను వర్తింపజేసింది.ఎంపిక చేసిన గ్రామాలకు 1957 ఇళ్లు మంజూరు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూరల్ మండలాల్లో 13 గ్రామాలను ఎంపిక చేశారు. ఎలిగేడు మండలం శివపల్లికి 108 ఇళు ్లు, జూలపల్లి మండలం కోనరావు పేటకు 144, ఓదెల మండలం శానగొండకు 217 ఇళ్లు, పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి 153, కాల్వశ్రీరాంపూర్ మండలం అంకంపల్లి 114, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి 167, అంతర్గాం మండలం మద్దిర్యాలకు 59, పాలకుర్తి మండలం రామారావుపల్లికి 124, మంథని మండలం అడవి సోమన్‌పల్లికి 228, ముత్తా రం మండలం మచ్చుపేటకు 40, కమాన్‌పూర్ మండ లం రొంపికుంటకు 208, రామగిరి మండలం రత్నా పూర్ 323 ఇళ్లు, ధర్మారం మండలం బంజేరుపల్లికి 72 ఇళు ్లు, మొత్తం 1957 ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 702 ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోయగా, 219 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నాయి. ఇంకా 1238 ఇళ్లకు ముగ్గులు పోయాల్సి ఉంది. ఈ నిర్మాణాలు కూడా ముందుకు సాగడం లేదు.మిగతా గ్రామాలు, పట్టణాల్లో ఎంపికలో జాప్యం జిల్లాలో ఎంపిక చేసిన 13 గ్రామాలు మినహా గ్రామాలు, పట్టణాల్లో లబ్ధిదారుల ఎంపిక ముందుకు సాగడం లేదు. జనవరి 23 నుంచి 25 వరకు నిర్వ హించిన గ్రామ, పట్టణ సభల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన వారి పేర్లను ప్రకటించారు. వారంతా తమకు ఎప్పుడు ఇళ్లు మంజూరు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 903 ఇళ్లు మంజూరు చేయగా, ఇంకా 2,599 ఇళ్లు, రామగుండం నియోజకవర్గంలో 183 ఇళ్లు మంజూరు చేయగా ఇంకా 3,317 ఇళ్లు, మంథని నియోజకవర్గ పరిధిలో 799 ఇళ్లు మంజూరు చేయగా, ఇంకా వెయ్యి ఇళ్ల వరకు మంజూరు చేయాల్సి ఉంది. లబ్ధిదారులను ఎమ్మెల్యేలు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేస్తున్నారు. అర్హులైన జాబితాలో ఏ ఊరికి ఎన్ని ఇళ్లు ఇవ్వాలి, ఏ పట్టణానికి ఎన్ని ఇళ్లు ఇవ్వాలనే విషయమై ఎమ్మెల్యేలు తర్జన భర్జన పడుతున్నారు. ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారుల జాబితాలను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తే, ఆ జాబితాపై మరోసారి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి తుది జాబితాను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి పంపిస్తారు. ఆయన దానిపై ఆమోద ముద్ర వేసిన తర్వాత కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేయనున్నారు. ఈ ప్రక్రియ ముగిసే వరకు మరింత సమయం పట్టనున్నది. పథకం ఆరంభమై మూడు మాసాలు గడుస్తున్నా లబ్ధిదారులను ఎంపిక చేయడంలో ఇందిరమ్మ కమిటీలు, ఎమ్మెల్యేలు తీవ్ర జాప్యాన్ని కనబరుస్తున్నారు. స్థానిక నాయకుల సూచ నల మేరకు ఇళ్లు మంజూరయ్యే అవకాశాలు కనబడు తున్నాయి. జిల్లాకు చెందిన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి ఇళ్ల మంజూరుకు చర్యలు చేపట్టాలని అర్హులు కోరుతున్నారు.

### జాతీయ లోక్ అదాలత్‌ను

# సద్వినియోగం చేసుకోవాలి




**సిరిసిల్ల -నవభూమి:** జాతీయ లోక్ అదాలత్‌ను సద్విని యోగం చేసుకోవాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ పి. నీరజ అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కోర్టుహాలు లో జూన్ 9 నుంచి 14వరకు నిర్వహించే ప్రత్యేక జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా పోలీసు అధికారులు, జ్యూడిషియల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అత్యధిక కేసుల పరిష్కారానికి కృషిచేయాలన్నా రు. ప్రధానంగా ఎన్‌ఐ యాక్ట్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులతో పాటు రాజీ అయ్యే క్రిమినల్, సివిల్ కేసుల పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వేలాది కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందుకు పోలీసు, జ్యూడిషియల్ అధికారులు సమన్వయంతో కృషి చేస్తే పరిష్కార మార్గానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగ కుండా ఉండేందుకు చివరికి రాజీయే రాజమార్గం అన్నారు. ఈ సమావేశం లో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వా ల్, సినియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, జూని యర్ సివిల్ జడ్జిలు ప్రవీణ్, సృజన, మేఘన, లోక్ అదాలత్ సభ్యులు చిం తోజు భాస్కర్, ఆడెపు వేణు, పీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# ‘పురుమల్ల’పై సస్పెన్షన్ వేటు



2

## లే నాన్న.. లేవు..!

# తండ్రి మృత దేహంపై పడి చిన్నారి రోధన



2

## జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలి



**మంథనిరూరల్, -నవభూమి:** వరంగల్-మంచిర్యాల జాతీయ రహ దారి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండలం లోని వెంపాడులో జరుగుతున్న జాతీయ రహదారి పనులు, పుట్టపాక, స్థానిక వ్యవ సాయ మార్కెట్ యార్డులో, ఏక్లాస్‌పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, మంథని పట్టణంలోని పాత పాల కేంద్రంలో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పా టు పనులను కలెక్టర్ మంగళవారం పరిశీ లించారు. ఆయన మాట్లాడుతూ.. యాసంగి పంట సీజన్‌లో రైతులు పండించిన నాణ్య మైన ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరుగుతుందని, కొనుగోలు కేం ద్రాల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తేమ ప్రమాణాలు రాగానే కొనుగోలు చేస్తున్నామని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే కేటాయించిన రైస్‌మిల్లు లకు తరలించేలా ఏర్పాటు చేశామన్నారు. మంథని పట్టణ ప్రాంతంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ సెంటర్ 3 రోజులలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల, మున్సిపల్ కమి షనర్ మనోహర్, మంథని, రామగరి తహసీ ల్దార్లు కుమారస్వామి, సుమన్, ఏడిఎం అంజని, అశోక్, పద్మ, మౌనిక, పాల్గొన్నారు. మండలంలోని ఆదివారంపేట్ గ్రామంలో జరుగుతున్న జాతీ య రహదారి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారు లకు సూచించారు. మంగళవారం మండలం లోని ఆదివారంపేట్ గ్రామంలో నిర్వహించే రహదారి పనుల పురోగతిని పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధి కారులను ఆదేశించారు. తహసీల్దార్ సుమన్, ఏడిఎం అంజని, ఆర్ఐలు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరా పై ఇబ్బందులు తలెత్తొద్దు.. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, -నవభూమి:** జిల్లాలో ఎక్కడ కూడా తాగు నీటికి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. పెద్దపల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ వేసవి కాలంలో తాగు నీటి సరఫరా పై అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మాట్లాడుతూ.. మిషన్ భగీరథ సోర్స్ గా తాగు నీటి సరఫరా చేయాలని, అనవసరంగా బోర్లు వేయవద్దని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇతర నీటి వనరుల పై ఆధారపడాలని అన్నారు. తాగు నీటి కోసం పంచాయతీ వద్ద అందుబాటులో ఉన్న నిధుల అత్యవసరంగా వాడుకోవాలని అన్నారు. వేసవి కాలంలో ఎక్కడా తాగు నీటి సరఫరా కొరత రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఎంపీడీవోలు సమస్యలు వచ్చిన వెంటనే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఇంటికి తాగునీటి సరఫరా తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ పూర్ణ చందర్ రావు, ఇంట్రా ఈఈ గంగాధర శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# 'పురుమల్ల'పై సస్పెన్షన్ వేటు



**కరీంనగర్ -నవభూమి:** కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌పై ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ సస్పెన్షన్ వేటు వేసింది. వెంటనే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని కమిటీ పేర్కొంది. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వ్యతిరేకంగా పురుమల్ల శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఆయన సస్పెన్షన్‌కు దారితీశాయి. జనవరి మొదటి వారంలో పురుమల్ల డీసీసీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి తాను నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నా తనకు తెలియకుండానే పదవుల నియామకాలు జరుగుతున్నాయని అన్నారు. తాను నామినేటెడ్ పదవుల భర్తీ కోసం సూచించిన పేర్లను పక్కన పెడుతున్నారని అందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కారణమని పరోక్షంగా పేర్కొంటూ మాట్లాడి పార్టీలో కలకలం సృష్టించారు. ఈ ఎపిసోడ్ ఇప్పటికే ఆగిపోలేదు.. మరికొన్ని ఎపిసోడ్‌లు ఉంటాయంటూ సవాల్ విసిరారు. ఆ సందర్భంగా పురుమల్లకు వ్యతిరేకంగా పలువురు కాంగ్రెస్ నేతలు పార్టీ క్రమశిక్షణ కమిటీకి, టీపీసీసీకి ఫిర్యాదు చేసి ఆయనపై చర్యకు డిమాండ్ చేశారు. జనవరి 6న షోకాజ్ నోటీస్ జనవరి 6న క్రమశిక్షణ కమిటీ పురుమల్లకు షోకాజ్ నోటీస్ పంపించింది. దానికి శ్రీనివాస్ జనవరి 11న వివరణ పంపించారు. క్రమశిక్షణ కమిటీ నుంచి వివరణకు సంబంధించి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ వ్యవహారం ఇంతటితో ముగిసిందని భావించారు. ఉన్నట్టుండి మంగళవారం జనవరి 6న ఇచ్చిన షోకాజ్ నోటీస్‌కు 11న మీరు పంపించిన వివరణతో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సంతృప్తి చెందలేదని, కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయించామని పేర్కొంటూ పురుమల్ల శ్రీనివాస్‌కు సస్పెన్షన్ ఆదేశాలు పంపించింది. పార్టీ సహచరులతో మీ ప్రవర్తనను సరిదిద్దుకోవడానికి తగినంత సమయం ఇచ్చినా వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, అందుకే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఈ ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయని తెలిపింది. కమిటీ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి ఈ ఆదేశాలను పురుమల్లకు పంపించారు. పార్టీ పెద్దల సమక్షంలోనే..డీసీసీ కార్యాలయంలో జరిగిన సమావేశం తర్వాత పురుమల్ల శ్రీనివాస్ మంత్రి ప్రభాకర్‌కు దూరంగా ఉంటూ వస్తూ వ్యతిరేక శిబిరంగా కొనసాగుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశాన్ని నిర్వహించగా ఆ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాట్లాడిన శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర గందరగోళానికి దారితీశాయి. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీ విశ్వనాథన్ పెరుమాళ్, జిల్లా పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్, పి రఘునాథ్ రెడ్డి సమక్షంలోనే పురుమల్ల శ్రీనివాస్ తాము నామినేటెడ్ పదవుల విషయంలో ఏ ప్రతిపాదనలు టీపీసీసీకి పంపించినా ఒక దుర్మార్గుడు అడ్డుకుంటున్నాడని అన్నారు. ఇప్పటికి నాలుగైదు ప్రతిపాదనలకు అదేగతి పట్టిందని ఆయన చేసిన వ్యాఖ్యలు సమావేశంలో ఒకరినొకరు తోసేసుకునే పరిస్థితి ఉత్పన్నమయింది. శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే దేవుళ్లని, అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవడంతో వారిలో అసంతృప్తి పెరిగిపోతున్నదని తెలిపారు. మంత్రిని టార్గెట్ చేస్తూ శ్రీనివాస్ మాట్లాడారని భావించిన ఆర్డీఏ సభ్యుడు పడాల రాహుల్, యూత్ కాంగ్రెస్ నాయకుడు బోనాల శ్రీనివాస్ తదితరులు పురుమల్లను అడ్డుకుంటూ ఆ దుర్మార్గుడెవరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక దశలో వేదికపైనే ఒకరినొకరు తోసుకుంటూ తీవ్ర గందరగోళ పరిస్థితిని సృష్టించడంతో డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి వారందరిని స్టేజీ కిందకు నెట్టేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్ తన సమక్షంలో జరిగిన ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణిస్తూ క్రమశిక్షణ ఉల్లంఘించిన వారిపై చర్యలుంటాయని, క్రమశిక్షణ తప్పేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అదే వేదికపై హెచ్చరించారు. ఏఐసీసీ కార్యదర్శి, పార్టీ పరిశీలకులు హాజరైన సమావేశంలో ఈ గొడవకు కారణమైన పురుమల్ల శ్రీనివాస్‌పై వేటు తప్పదనే అభిప్రాయం వ్యక్తమయింది. ఈ సంఘటన తర్వాత కూడా పలువురు టీపీసీసీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే క్రమశిక్షణ కమిటీ పురుమల్ల శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## లే నాన్న.. లేవు..! తండ్రి మృత దేహంపై పడి చిన్నారి ఆలాపన





**సిరిసిల్ల -నవభూమి:** అభం శుభం తెలియని ఆ చిన్నారికి తండ్రి చనిపోయాడు అన్న విషయం తెలియక ఆ చిన్నారి చేతులతో నాన్న ముఖంపై చేయి వేసి నాన్న.. లే.. నాన్న.. అన్న మూగ సైగలు అక్కడ ఉన్న వారిని సైతం కలిసి వేసిన సంఘటన తంగళ్ళపల్లి మండలం మండేపల్లి కేసీఆర్ నగర్లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ కు చెందిన తాడూరి రామ్ కుమార్ (38) 14 సంవత్సరాల క్రితం వేములవాడ పట్టణానికి చెందిన అనితను కులాంతర వివాహం చేసుకున్నాడు. అప్పటినుండి పెద్దలకు దూరంగా ఉంటూ సిరిసిల్లలో జిరాక్స్ మెషిన్ మెకానిక్‌గా పని చేస్తూ, తన తమ్ముడితో వివాహ ఈవెంట్లను చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ తరుణంలో ముగ్గురు కొడుకులు సుఖజిత్ 11, శ్రీవాస్తవ్ 5, విహన్ 1 పుట్టారని, ఆ సమయంలో వైద్య ఖర్చులకోసం కాస్త అప్పు అయిందని ఆమె తెలిపింది. సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా కొంతకాలం పని చేశానని, కరోనా రావడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తయని ఆమె పేర్కొంది. చేసిన రూ.మూడు లక్షల అప్పు తీర్చేది ఎలా.. ఎంత పని చేసినా డబ్బులు రావడం లేదని ఇలాగైతే అప్పులు ఎలా తీర్చేది అంటూ మనస్థాపానికి గురయ్యాడు. గత రెండు రోజుల క్రితం వివాహ ఈవెంట్ ఉందని వరంగల్ కు వెళ్తున్న అని చెప్పి వెళ్లి తిరిగి బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వచ్చాడని ఆమె తెలిపింది. మధ్యాహ్నం సమయంలో పెద్ద కొడుకు సుఖజీతో బట్టలు సర్దుకో నాని మనం ఊరికి వెళ్దాం అంటూ చెబుతూ ఇద్దరి తమ్ముళ్లను బాగా చూసుకోమని చెప్పినట్లు పెద్ద కొడుకు తెలిపాడు. ఇంతలో గదిలోకి వెళ్లి డోర్ వేసుకున్నాడని, కాసేపటి తర్వాత ఎంత పిలిచినా.. డోర్ తీయకపోవడంతో పక్కింటి వారి సహాయంతో డోర్ ను పగలగొట్టి చూడగా తన భర్త విగత జీవిగా ఉరివేసుకొని కనిపించాడని భార్య రోధిస్తూ తెలిపింది. అభం శుభం తెలియని చిన్న కుమారుడు విహాన్ తన తండ్రి చనిపోయాడు అన్న విషయం కూడా తెలియని ఆ పసిబాబు తండ్రిని తట్టి లేపుతున్న సంఘటన పలువురిని కంటతడి పెట్టించింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించి మృతుడి భార్య అనిత ఫిర్యాదు ఇన్చార్జి ఎస్సై వినీత రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కోరుట్లలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ వాసులను వెనక్కి పంపాలి

**కోరుట్ల, -నవభూమి:** కోరుట్ల పట్టణంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్ కు చెందిన వారు అక్రమంగా నివసిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయని, విదేశీయులను పట్టుకొని స్వస్థలాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ జివాకర్ రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుంచి అక్రమంగా ప్రవేశించిన వలసదారులు పట్టణంలో అక్రమంగా నివసిస్తున్నట్లు ప్రజల్లో అనుమానాలు ఉన్నాయన్నారు. విదేశీయులతో భద్రత సమస్యలు ఉత్పన్నమవుతాయని, భవిష్యత్తులో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా గుర్తించాలని పేర్కొన్నారు. అక్రమంగా నివాసముంటున్న విదేశీయులను గుర్తించి వారి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇందూరి తిరుమల వాసు, సుదవేనీ మహేష్ , ఎర్ర రాజేందర్, ఒల్లోజి నగేష్, సాడిగే మహేష్, కలాల సాయి చందు, మేకల గణేష్, దమ్మ సంతోష్, రాజేందర్ రెడ్డి, ప్రశాంత్, రాహుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## పెళ్లి కాలేదని బెంగతో ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



**ఎల్లారెడ్డిపేట, -నవభూమి:** పెళ్లి కావడం లేదని బెంగతో మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రొహిబిషన్ ఎస్సై లక్ష్మణ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఒగ్గు మహేష్(23) కు గత కొంతకాలంగా పెళ్లి చూపులు చూస్తున్నప్పటికీ సంబంధాలు క్యాన్సల్ అవుతూ వస్తున్నాయి.దీంతో మనస్థాపానికి లోనైన మహేష్ ఎల్లారెడ్డిపేట శివారులో ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.


## 20న సింగరేణిలో సమ్మె.. విజయవంతం చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పిలుపు



**గోదావరిఖని-నవభూమి:** ఈనెల 20న దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా వివిధ పరిశ్రమల్లో జరిగే ఒకరోజు సమ్మెను సింగరేణిలో నిర్వహించాలని భావిస్తున్న క్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్మికుల హక్కులను దృష్టిలో ఉంచుకొని సమ్మెకు మద్దతు ప్రకటిస్తూ 11 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసులు యజమాన్యానికి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటం చేయాల్సిన అవకాశం ఏర్పడింది అని సింగరేణి సంస్థకు సంబంధించిన బొగ్గు బ్లాక్ లను సింగరేణికి కేటాయించాలని నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని సింగరేణి సంస్థలో పెర్క్స్ పై విధిస్తున్న ఇన్కంటాక్స్ ను రద్దు చేయాలని 1 జులై 2016 నుంచి అర్హులైన రిటైర్డ్ కార్మికులకు రూ.20 లక్షలు గ్రాట్యూటీ చెల్లించాలని ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జరుగుతున్న సమ్మెను కార్మికులు సంపూర్ణంగా మద్దతు తెలుపుతూ సమ్మెలో పాల్గొనాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో నాయకులు మాదాసు రామ్మూర్తి, నూనె కొమరయ్య, పర్లపెల్లి రవికుమార్, చల్లా రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు

**కమాన్ -నవభూమి:** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్ నగర్ హరిహర క్షేత్రం ప్రాంగణంలోని వెంకటేశ్వర స్వామి, అయ్యప్ప, శివాలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యాగంట్ల అనిల్ కుమార్ గౌడ్, కొన్న కాంతరెడ్డి, అర్చకులు రాజేశ్వర శర్మ, శ్రీనివాస శర్మ, చాణక్య, గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# స్పందన అంతంతే

**సిరిసిల్ల -నవభూమి:** లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్)కు గడువు పొడిగిస్తున్నా ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో అధికారులు కదలరు.. దరఖాస్తుదారులు ముందుకు రారు.. అన్నట్లుగానే మారింది. నాలుగోసారి గడువు పొడిగిస్తూ మే 31వరకు ప్రభుత్వం మరో అవకాశాన్ని ఇచ్చింది. జిల్లాలో ఎల్ఆర్ఎస్ ద్వారా దాదాపు రూ.40 కోట్ల వరకు ఆదాయం వస్తుందని భావించినా మే 3 వరకు ఇచ్చిన గడువు మేరకు జిల్లాలో రూ.19 కోట్ల వరకు మాత్రమే ఆదాయం లభించింది.సాంకేతిక సమస్యలే...భూముల క్రమబద్ధీకరణతో ఆదాయం సమకూరుతుందని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి నిర్దేశిత ఫీజులో 25 శాతం రాయితీ ప్రకటించినా జిల్లాలో అనుకున్న మేరకు స్పందన లభించలేదు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి ప్రత్యేక వెబ్సైట్ను ఏర్పాటు చేశారు. యూజర్ మాన్యువల్ ఫీ రిజిస్ట్రేషన్ వెబ్సైట్కు సంబంధించి సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయని చెబుతున్నారు. సర్వర్లు బిజీగా ఉండడం, ఆన్లైన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మరోవైపు దరఖాస్తుదారులకు నేరుగా ఆటో జనరేట్ మేసేజ్లు వెళ్లకపోవడం, సర్వర్లు మోరాయించడం వంటి ఇబ్బందులను దరఖాస్తుదారులు ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు ఎన్నో వ్యయప్రయసాలకు ఓర్చి దరఖాస్తులు చేసుకున్న వారికి సాంకేతిక సమస్యల నేపథ్యంలో ఎల్ 1 దశలోనే దరఖాస్తులకు బ్రేక్లు పడుతున్నాయని వాపోతున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు మూడంచెల విధానం ఉండడంతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పథకంగా ఉండడంతో గడువు ముగిసినా మే 31 వరకు మళ్లీ పొడిగించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూములను క్రమబద్ధీకరించేందుకు చేపట్టిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుదారులకు చెల్లింపునకు 25 శాతం రాయితీ కల్పించినా రాజన్న సిరిసిల్ల జిల్లాలో అంతంత మాత్రంగానే దరఖాస్తుదారుల నుంచి స్పందన వచ్చింది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో అధికారుల మధ్య సమన్వయలోపం, దరఖాస్తుదారులను ప్రోత్సహించకపోవడంతో ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మార్చి 31 వరకు ఇచ్చిన రాయితీ గడువు ముగిసినా ఎల్ఆర్ఎస్ అట్టర్ ఫ్లాప్గానే కొనసాగింది. దీంతో ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ గడువును ఏప్రిల్ 30 వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. ఈనెలలోనైనా అధికారులు దరఖాస్తుదారులను ప్రోత్సహించి ఎల్ఆర్ఎస్ పక్రియను వేగవంతం చేసి ఇటు ప్రజల సమస్యలను తీర్చడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం ఎంత మేరకు చేకూరుస్తారనే దానిపై అనుమానాలే వ్యక్తం అవుతున్నాయి.రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎల్ఆర్ఎస్ కింద 42,942 దరఖాస్తులు వచ్చాయి. గత నెలలో 37,071 మంది దరఖాస్తుదారులకు ఎల్ఆర్ఎస్ చెల్లించే విధంగా సమాచారం అందించారు. 4,896 దరఖాస్తులను తిరస్కరించారు. మార్చి 31 వరకు రూ.17.33 కోట్లు ఆదాయం ఎల్ఆర్ఎస్ ద్వారా సమకూరింది. తరువాత ఏప్రిల్ 30 వరకు గడువు ఇచ్చారు. సాంకేతిక సమస్యలతో మే 3 వరకు అవకాశం ఇచ్చారు. కానీ పెద్దగా స్పందన లభించలేదు. రూ 19 కోట్ల వరకే పెరిగింది. గడువు పొడిగిస్తున్నా అనుమతి లేని ప్లాట్లు లేఅవుట్ల క్రమబద్దీకరణ కోసం ఎల్ఆర్ఎస్లో 25శాతం రాయితీ నిర్ణయంతో దరఖాస్తుల ప్రక్రియ పూర్తవుతుందని ప్రభుత్వం భావించినా అనుకున్న మేరకు సక్సెస్గా ముందుకు వెళ్లడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలతో పాటు 260 గ్రామపంచాయతీల పరి?ధిలో ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరణ కోసం 42,942 దరఖాస్తులు వచ్చాయి. 2020 సెప్టెంబరులో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రజలపై మోయలేని భారం మోపిందనే అభిప్రాయంతో ఎవరూ దరఖాస్తులు చేసుకున్నా ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీలు గ్రామపంచాయతీల్లో అక్రమ లేఅవుట్లు, రిజిస్ట్రేషన్లు లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు సెప్టెంబరు 1, 2020న బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 26 ఆగస్టు 2020లోపు సేల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసిన లే అవుట్ల యజమానులు ప్లాట్ ఓనర్లకు




ఎల్ఆర్ఎస్కు అవకాశం కల్పించింది. కానీ ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎప్పుడో 20 ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకొని ఇంటి పన్నులు చెల్లించి క్రయవిక్రయాలు జరిపిన వారు కూడా ఎల్ఆర్ఎస్ చెల్లించే పరిస్థితి నెలకొంది. లేనిపక్షంలో క్రయ విక్రయాలు జరిపే అవకాశం లేని పరిస్థితి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయడానికి నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్పై ప్రకటనలు చేసి సర్వేలు చేయడానికి జిల్లాకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమించారు. గత సంవత్సరం జూలై నెలలో మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటి పారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులతో ప్రత్యేక బృందాలను దరఖాస్తుల పరిశీలనకు ఏర్పాటు చేసింది. వాటిని పరిశీలించి దరఖాస్తుదారులకు సమాచారం అందించారు. 25 శాతం రాయితీని ప్రకటించినా అనుకున్న మేరకు వేగం పెరగలేదు. మళ్లీ తాజాగా ప్రభుత్వం ఏప్రిల్ 30లోపు దరఖాస్తు చేస్తే 25 శాతం రాయితీపై గడువు పొడిగించింది. లే అవుట్లలో కేవలం పది శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయ్యి ఉండి.. మిగిలినవి రిజిస్ట్రేషన్ కాకపోతే 90 శాతం ప్లాట్లు క్రమబద్ధీకరణకు అనుమతిస్తున్నారు. చాలా మంది రియల్టర్లు అనుమతి లే అవుట్ ప్లాట్లు కొన్నవారు రూ 10 వేల చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత రూ 1000 చొప్పున చెల్లించారు. ప్రస్తుతం రాయితీతోనైనా ఎల్ఆర్ఎస్ ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నా వేగం మాత్రం కనిపించడం లేదు.జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఇలా...రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు వచ్చిన 42,942 దరఖాస్తుల్లో 37,071 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. వచ్చిన దరఖాస్తుల్లో సిరిసిల్ల మున్సిపాలిటీలో 10,493 దరఖాస్తులు, వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో 16,336 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు ఉండగా 16113 దరఖాస్తులు వచ్చాయి. బోయినపల్లి మండలంలో 20 గ్రామపంచాయతీల్లో 645 దరఖాస్తులు, చందుర్తిలో 15 గ్రామపంచాయతీల్లో 213, ఇల్లంతకుంటలో 24 గ్రామపంచాయతీల్లో 1054, గంభీరావుపేటలో 17 గ్రామపంచాయతీల్లో 861, కోనరావుపేటలో 15 గ్రామపంచాయతీల్లో 277, వేములవాడ అర్బన్ మండలంలో తొమ్మిది గ్రామపంచాయతీల్లో 3702, ముస్తాబాద్ మండలంలో 1074, ఎల్లారెడ్డిపేట మండలంలో 16 గ్రామపంచాయతీల్లో 3949, తంగళ్లపల్లిలో 26 గ్రామపంచాయతీల్లో 3784, వేములవాడ రూరల్ మండలంలో 15 గ్రామపంచాయతీల్లో 214, రుద్రంగిలో రెండు గ్రామపంచాయతీల్లో 304, వీర్నపల్లిలో మూడు గ్రామపంచాయతీల్లో 71 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో ప్లాట్కు గత మార్కెట్ ధరలకు అనుగుణంగా కనీసం రూ 20 నుంచి రూ 50 వేల వరకు ఆదాయం లభిస్తుంది. ఎల్ఆర్ఎస్కు సంబంధించి 25 శాతం రాయితీ ప్రకటించినా దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రాకపోవడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో భూముల ధరలు ఆశాజనకంగా లేకపోవడం, అమ్మకాలు లేకపోవడం, భూ సంబంధ వివాదాలు కేసులపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత లేకపోవడం వంటి కారణాలతోనే దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదని భావిస్తున్నారు. మరోవైపు నిషేధిత ఖాతాల్లోకి అనేక ప్లాట్లు వెళ్లాయి. ఆ ప్లాట్ల క్రమబద్ధీకరణ కష్టమేనని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

## రహదారుల నిర్మాణంతో అభివృద్ధి

**ఎలిగేడు, -నవభూమి:** గ్రామీణ ప్రాంతాల్లో లింక్ రోడ్లను తారురోడ్లుగా నిర్మించుకుంటే రవాణా సౌలభ్యం మెరుగుపడి ఆయా ప్రాం తాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం శివపల్లి నుంచి నర్సయ్యపల్లి(ఎస్సీకాలనీ)వరకు తారురోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ ద్వారా మంజూరైన రూ.2కోట్ల 45లక్షల నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మిగిలి ఉన్న గొలుసు రోడ్లను గుర్తించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.రెండోదశలో శివపల్లి నుంచి సుల్తాన్పూర్ వరకున్న రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎలాంటి కటింగులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరుగుతున్నాయని తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ రాష్ట్ర యువజన కార్య దర్శి దుగ్యాల సంతోష్రావు, నాయకులు పాలేపు పూర్ణసుధాకర్రావు, అర్షనపల్లి వెంకటేశ్వర్రావు, తిరుపతిగౌడ్, కోరుకంటి వెంకటేశ్వర్రావు, నరహరి సుధాకర్రెడ్డి, చింతకుంట గోపి, తాటిపల్లి రమేష్బాబు, దుగ్యాల గోపాల్రావు, పాల్గొన్నారు.



# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

**చందుర్తి,-నవభూమి:** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూత నంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భా గంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియో గం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలు పునిచ్చారు. రుద్రంగి, మానాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. రైతు లు, ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చే శారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని తెలిపారు. ఇప్ప టికే అన్ని మండలాల్లో నూతన చట్టం గురించి అవగా హన కల్పించామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రుద్రంగి మండలాన్ని పైలెట్ ప్రాతిపదికన ఎం పిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వ హిస్తున్నామన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భూ రికా ర్డులలో పేరు తప్పులు,విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారస త్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూసమస్యలు, సర్వేనంబర్ మిస్సింగ్, పట్టా పాస్‌బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూముల ను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట-బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబం ధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి కొత్త ఆర్.ఓ ఆర్ చట్టం ప్రకారం అధికారుల క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువులోపు పరిష్కరించడం జరుగు తుందని తెలిపారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికా రులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీక రిస్తారని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ఆన్లైన్లో కూడా అప్లై చేసుకోవచ్చన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీ త ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తు లను అందజేస్తారన్నారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలి..కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మానాల కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణను ఆర్డీవో శేషాద్రితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సేకరిం చిన ధాన్యాన్ని వెంటవెంటనే తరలించాలని, కొనుగోళ్ల లో వేగం పెంచాలని ఆదేశించారు.



# పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి,-నవభూమి:** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. కలెక్టరేట్‌లో టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు, యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు బుధవారం వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మోడల్ స్కూల్స్??, గురుకులాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలో టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా చేపట్టిన అదనపు తరగతులు, సైన్స్?? ల్యాబ్ నిర్మాణం, కాంపౌండ్ వాల్ వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనులు ప్రారంభించాలని, నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని సూచించారు.రామగుండం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రినోవేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం కింద గోదావరిఖని పీజీ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు టెండర్ ఒప్పందం పూర్తి చేసి, ఈనెల 20 వరకు పనులు ప్రారంభించాలన్నారు. చిల్డ్రన్ హోమ్ నిర్మాణంలో పురోగతి సరిగ్గా లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తయ్యేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.రూ. 1.10 కోట్లతో చేపట్టే ఐటీఐ ఇన్నోవేషన్ పనుల టెండర్లు పూర్తి చేసి 5 నెలల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలోటీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనితా శింగనాథ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత.. హుస్నాబాద్ నియోజక వర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి

**చిగురుమామిడి,-నవభూమి:** డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్రలో భాగంగా చిగురుమామిడి మండలం లో రెండవ రోజు ముదిమాణిక్యం, రామంచ, చిన్న ముల్కనూర్, కొండాపూర్ గ్రామాలలో జేఏసీ మరియు ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు బుధవారం నిర్వహించారు. జేఏసీ నాయకులు గ్రామాలలో డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాలు, లోకజ్ఞానం లేనటువంటి విద్యార్థులకు, నూతన జీవితాలను ప్రారంభించే యువతక ఈ డ్రగ్స్ ను అంటిపెట్టుకొని రేపటి దేశానికి పాలకులుగా ,ఉద్యోగులుగా ,రాజకీయనాయకులుగా ,పారిశ్రామికవేత్తలుగా ఎదగవలసిన యువత అర్ధాంతరంగా చనిపోవడం కుటుంబాలలో కడువిషాదాన్ని నింపుతున్నాయన్నారు. పెళ్లి చేసుకున్న స్త్రీలు చిన్నవయసులోనే వితంతువులుగా మిగిలి పోవడం సమాజాన్ని పట్టిపీడిస్తుందన్నారు. డ్రగ్స్ తీసుకొని ఆరోగ్యంగా, ఆర్థికంగా, సామాజికంగా కృంగిపోవడం ఈ దేశానికి మంచిది కాదు. ఒకవైపు దేశానికి పాకిస్తాన్, చైనా, ఆఫ్ఘనిస్తాన్ దేశాలతో యుద్ధం పొంచి ఉంటే మన దేశాన్ని కాపాడుకోవాల్సిన యువత మత్తుకు బానిసలై చనిపోవడం దేశ శక్తిని కోల్పోతున్నాం అని అన్నారు, పోలీస్, నార్కోటిక్,ఎక్సైజ్ శాఖలు డ్రగ్స్ ని అరికట్టడానికి ప్రయత్నిస్తున్నప్పటికి ఇంకా విజృంభించి పల్లెలు దాకా వచ్చిందన్నారు.సమాజంలో ఉన్న ప్రతి వర్గం పార్టీలకతీతంగా ఏకమై డ్రగ్స్ నీ నిర్మూలించినప్పుడే యువత ను కాపాడుకున్న అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, నియోజకవర్గం కో ఆర్డినేటర్ డ్యాగల సారయ్య, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేప్యాల ప్రకాష్, లోడీ సంస్థ ప్రతినిధులు ఉప్పుల కుమారస్వామి,గాండ్ల పద్మ,జేఏసీ బాధ్యులు డాక్టర్ ఎదులపురం తిరుపతి, వేముల జగదీష్, తాళ్లపల్లి జగన్, తాళ్లపల్లి ప్రభాకర్, ఎర్ర కార్తీక్, సెర్ప్ (ఐకెపి) సీసీ గంప సంపత్, పంచాయతీ కార్యదర్శిలు గాజుల శ్రీలక్ష్మి, అమృత వర్షిని, జగన్ గౌడ్, రమేష్, లక్ష్మారెడ్డి, అచ్చ రవి, వంగర మల్లేశం, రాజేశం, బాబు, వేణు, వెంకటేశం, లత, మంజుల, సత్తయ్య, ప్రేమలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై మాట్లాడితే కేసులు

**గంభీరావుపేట,-నవభూమి:** రైతు సమస్యలపై మాట్లా డితే ఇతర పార్టీ నాయకులపై కాంగ్రెస్ నాయకులు పోలీస్‌లపై ఒత్తిడి తెచ్చి కేసులు పెడతారా అంటూ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బండి సంజయ్ సందర్శించారు. రైతుల సమ స్యలను అడిగితెలుసుకున్నారు. అప్పులు పుడతలేవు, పంట దిగుబ డి తగ్గింది.. వచ్చిన ధాన్యాన్ని అమ్ముకుందామంటే కొనుగోలు కేం ద్రాల్లో ఈ పరిస్థితి సారూ.. అంటూ బండి సంజయ్‌తో రైతులు గోడు వెల్లబోసుకున్నారు. వానోస్తే టార్పాలిన్ కవర్లు కూడా లేవు.. కిలోల కొద్ది కోత పెడుతున్నారు అంటూ వాపోయారు. ఈ సంద ర్భంగా బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, కనీసం వారి గోడు వినడానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వ నాయకులు రావడం లేదన్నారు. ధాన్యం కొనుగో లు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బంది ఏంటో చెప్పాలన్నారు. పండించిన ప్రతి గింజను కేంద్ర ప్రభుత్వమే కొంటుందని, సుతిలు తాడు, గోనెసంచి, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు, లేబర్ పైసలు... ఇలా అన్ని పైసలు కేంద్ర ప్రభుత్వమే ఇస్తుంటే కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏందో చెప్పాలన్నారు. 25రోజులుగా ధాన్యం కొను గోళ్ళకు అతీగతీ లేదని, ఇంత దరుణం ఎక్కడా లేదన్నారు. కరీంనగ ర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో 580 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిం చారని, ఈ రెండు జిల్లాలో 7 లక్షల మెట్రిక్ టన్నుల టార్గెట్ ఉంటే, ఇప్పటివరకు రెండున్నర లక్షలు కూడా దాటలేదన్నారు. రాష్ట్ర వ్యా ప్తంగా ఇదేపరిస్థితి ఉందన్నారు. నిన్నమొన్న పడిన వర్షాలతో రైతు లకు చాలా నష్టం వాటిల్లిందని, ధాన్యం ఎండకు ఎండుతోందని, వానకు తడుస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో, ఆ తరువాత.. ఇలా రెండుసార్లు కటింగ్ చేస్తుండటంతో ఒక్క క్వింటా లుకు కిలోల చొప్పును నష్టం వస్తోందన్నారు. మండల స్థాయి అధి కారులకు, జిల్లా అధికారులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ ఇస్తే సమస్య ఉండేది కాదని, రాజకీయ జోక్యంతోనే ఇబ్బందులు ఏర్పడుతున్నా యన్నారు. రైతు సమస్యలపై ప్రశ్నిస్తే పోలీస్‌లపై ఒత్తిడితెచ్చి కేసు లు పెడుతున్నారన్నారన్నారు. గత ప్రభుత్వం ఏ విధంగా అరాచకం చేసిందో ఈ ప్రభుత్వం కూడా దానికి తగ్గట్టుగానే అరాచకం చేస్తుం దన్నారు. వడ్ల డబ్బులు ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే కొనేది కేంద్ర ప్రభుత్వమే మధ్యలో మీడియటర్‌గా ఉండే ఈ కాంగ్రెస్ ప్రభుత్వా నికి వచ్చిన ఇబ్బంది ఏంటో ఇప్పటికైనా చెప్పాలన్నారు. చివరికి ముఖ్యమంత్రి తనతో ఏమికాదని, చేతులు ఎత్తేశాడని గుర్తుచేశారు. యుద్ధప్రాతిపదికన వడ్లను కొనుగోలు చేయాలని, వడ్ల డబ్బులన్నీ రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల బీజేపీ అధ్య క్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధులు గడ్డమీది ప్రసాద్ రెడ్డి, దెవసాని కృష్ణ, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కోడె రమేష్, ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, నా యకులు రాజిరెడ్డి, సత్యనారాయణ, స్వామి, నాగరాజు, రాజు తదిత రులు ఉన్నారు. కాగా, నర్మాల గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యం లో జరుగుతున్న మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బండి సంజయ్ పాల్గొన్నారు. శివలింగసహిత మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు.బీజేపీ నాయకుడికి పరామర్శ మండలకేంద్రంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దెవసాని కృష్ణ ను బండి సంజయ్ పరామర్శించారు. ఇటీవల కృష్ణ తండ్రి జనార్దన్ మృతిచెందడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.



## ఇందిరమ్మ కమిటీల పేర అర్హులకు అన్యాయం.. బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ రెడ్డి



**చిగురుమామిడి,-నవభూమి:** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని, ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఈ జాబితాను రూపొందించడంలో ఆంతర్యం ఏమిటని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, నాయకులతో కలిసి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ఇల్లు లేని వారికి, కిరాయి గృహాల్లో ఉన్న వారికి కాకుండా ఇందిరమ్మ కమిటీల పేరుతో మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు అనుకూలంగా ఉన్న వారికే ఇల్లు మంజూరు చేస్తున్నారని, అర్హులైన లబ్ధిదారులను పక్కన పెడుతున్నారని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకి మండలంలో కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని సోషల్ మీడియా గ్రూపులలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే పోస్టులు పెడుతున్నారని అన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తక్షణమే స్పందించి మండలంలో అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, వీటి ఎంపికలో అధికారులను బలి పశువులను చేయకుండా పూర్తి పారదర్శకతను పాటించాలని వారు డిమాండ్ చేశారు. మొదటి విడతలో ఎంపికైన గునుకుల పల్లె గ్రామపంచాయతీలో ఏఈ సమక్షంలో ముగ్గు పోసిన ఇంటికి బిల్లు రాకుండా అడ్డుకుంటున్నారని, 400 చదరపు అడుగుల నుండి 600 వరకు ఉండాలనే నిబంధనను తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయకపోతే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగల్ విండో చైర్మన్ రమణారెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి పేసరి రాజేశం పాల్గొన్నారు

## ప్రణాళికాయుతంగా పట్టణాభివృద్ధి పనులు.. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి,-నవభూమి:** ప్రణాళికాయుతంగా పెద్దపల్లి పట్టణాభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మున్సిపల్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో పెద్దపల్లి మున్సిపల్ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. పట్టణంలో నిర్మించిన రెండు పడుకల గదుల ఇండ్లకు తాగునీరు, విద్యుత్ సరఫరా, సీవరేజి లైన్ తదతర మౌలిక వసతుల పనులు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగు నీటి సరఫరా ప్రతీ ఇంటికి జరుగుతుందో లెదో పరిశీలించి 15 రోజులలో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 20 నాటికి లబ్ధిదారులకు ఇండ్లు అందించేందుకు సన్నద్ధం కావాలన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే పదేండ్ల పట్టణ ప్రగతిని అంచనా వేస్తూ ప్రతి రోజు తాగునీటి సరఫరా చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని అధికారులకు సూచించారు. ఏడాదికి ఆస్తి పన్ను రూ. 6 కోట్లు వసూలు అయ్యే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పట్టణంలో ఎక్కడా కూడా అక్రమ లెఔట్ ఉండటానికి వీలు లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ నుంచి తీసుకున్న అనుమతి కంటే అధికంగా ఫ్లోర్ నిర్మించే వారి పై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ అభివృద్ధి పనుల్లో భాగంగా అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్??ఫార్మర్ షిఫ్టింగ్ పనులు పూర్తి చేయాలన్నారు .మున్సిపల్, విద్యుత్, మిషన్ భగీరథ అధికారులతో పాటు ఇతర అధికారులు సమన్వయంతో పని చేసి పట్టణాన్ని అన్ని విదాలుగా అభివృద్ధి చేయలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, విద్యుత్ శాఖ పెద్దపల్లి డీఈ తిరుపతి, మున్సిపల్ ఏఈ సతీష్, టీపీఎస్ వినయ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కూలి రేట్లు పెంచాలని సిరిసిల్లలో

# వార్పిన్ కార్మికుల ధర్నా

**రాజన్న సిరిసిల్ల,-నవభూమి:** వార్పిన్ కార్మికుల పట్ల పాలిస్టర్ యజమానుల మొండి వైఖరిని నిరసిస్తూ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తి దారుల సంఘం కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం వార్పిన్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్ లోన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మోసం రమేష్ మాట్లాడుతూ పాలిస్టర్ వస్త్ర యజమానులు వార్పిన్ కార్మికుల పట్ల పూర్తిగా నిర్లక్ష్య ధోరణి తో వ్యవహరిస్తున్నారన్నారు. వార్పిన్ కార్మికులకు గత బతుకమ్మ చీరల పనికంటే రెండింతలు పని బారం పెరిగిందని, పనికి తగ్గ వేతనం ఇవ్వడానికి యజమానులు ముందుకు రావడం లేదన్నారు. యజమాల వైఖరికి నిరసనగా ఈరోజు నుండి నుండి కార్మికులు సమ్మెబాట పట్టినట్లు తెలిపారు. కార్మికుల కూలీ నిర్ణయం చేయవలసిన అధికారులు యజమానులకు అప్పజెప్పడం వల్ల ఈ సమస్య తలెత్తినట్లు పేర్కొన్నారు. స్థానిక చేనేత జౌళి శాఖ అధికారులు కార్మికుల విషయాన్ని అసలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. బట్ట ఉత్పత్తి చేసేది కార్మికులైతే, వారితో మాట్లాడడానికి కూడా అధికారులు సమయం ఇవ్వడం లేదని, కార్మికుల కోసం ప్రవేశపెట్టిన పథకం యజమానుల పథకముగా



మారిందన్నారు. యజమానులు తమ లాభాల గురించి ఆలోచిస్తున్నారే తప్ప కార్మికుల కు మెరుగైన వేతనం అందించాలన్న ఆలోచన ఏ మాత్రం చేయడం లే దన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి కార్మికులకు న్యాయమైన కూలీ నిర్ణయించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారులు సమస్యను పరిష్కరించని పక్షంలో గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్మికులందరూ పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ, యూనియన్ అధ్యక్షులు సిరిమల్లె సత్యం, వైపనీ యూనియన్ అధ్యక్షులు కుమ్మరి కుంట కిషన్, ఉడుత రవి, మచ్చ వేణు, వై పని, యూనియన్ జిల్లా నాయకులు ఒగ్గు గణేష్, ఎలికేటి శ్రీనివాస్, ప్రవీణ్ బూట్ల వెంకటేశ్వర్లు, దోమల రమేష్, చింత కింది సుధన్, తదితరులు పాల్గొన్నారు.

### అవినీతి దందాలపై

# ఉక్కు పాదం మోపుతం.. సింగరేణి

**గోదావరిఖని-నవభూమి:** శ్రమకు మారుపేరుగా నిలుస్తూ, దేశానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి సంస్థలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై వేటు వేసేందుకు సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి యజమాన్యం బుధవారం నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. సింగరేణి యాజమాన్యం ఇప్పటికే అరాచక శక్తులను ఏరివేయడం జరిగిందని, ఇంకా అవినీతి దందాలు నడిపే వారికి సంబంధించిన, వెనక ఉండి నడిపిస్తున్న వారి సమాచారం తెలియజేస్తే వారిని కూడా ఉక్కుపాదంతో అనచివేస్తామని సింగరేణి యాజమాన్యం హెచ్చరించింది. మెడికల్ బోర్డు ప్రక్రియ లో అన్ ఫిట్ చేయిస్తామని, బదిలీలు జరిపిస్తామని, కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్ చేయిస్తామని, డిప్యూటేషన్లు, ఇంటర్నల్, ఎక్స్ టర్నల్ పరీక్షల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సింగరేణి ఉద్యోగిని మంగళవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో సంస్థ ఈ ప్రకటన జారీ చేసింది. అమాయకులైన కార్మికులను వంచిస్తున్న ఎవరినైనా సరే సంస్థ ఉపేక్షించబోదని, కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. అవినీతి చర్యలకు పాల్పడే వారిని, వారికి వెనుక ఉండి సహకారం అందించే వారిని సైతం వదిలిపెట్టే ప్రసక్తే లేదని యాజమాన్యం హెచ్చరించింది. అవినీతికి బలైన బాధితులు, లేదా దీనిపై సమాచారం ఉన్న ఏ ఇతర కార్మికులు, ఇతరులైన సరే సింగరేణి విజిలెన్స్ శాఖకు తెలియజేయవచ్చుని, ఫిర్యాదుదారుల పేర్లను గోప్యంగా ఉంచడమే కాక వారికి సంస్థ పూర్తి రక్షణ కల్పిస్తుందని యాజమాన్యం పేర్కొంది. అలాగే సింగరేణి సంస్థ లో వివిధ పనులు చేయిస్తామని పేరుతో మోసాలకు పాల్పడుతున్న వారి వివరాలు, ఆధారాలు ఇచ్చిన వారికి రూ.10 వేల పారితోషకం కూడా ఇవ్వనున్నట్లు పునరుద్ఘాటించింది. అదే సమయంలో సింగరేణి కార్మికులు తప్పుడు వ్యక్తుల సోపతి పట్టి వక్రమార్గాల్లో పయనించి ఉద్యోగ జీవితాన్ని పాడుచేసుకోవద్దని, ప్రలోభ పెట్టే వారిని దగ్గరకు రానియొద్దని హితవు పలికింది. ఏరియా, గనుల్లో, డిపార్ట మెంట్ ల్లో సింగరేణి ఉద్యోగులు లేదా అధికారులు, లేక బయట వ్యక్తులు ఎవరైనా సరే లంచాలు ఆశిస్తున్నట్లయితే వారి వివరాలను విజిలెన్స్ శాఖ, ఏసీబీకి అందించి పట్టించాలని యాజమాన్యం సూచించింది. అవినీతిని, అక్రమాలను కూకటివేళ్లతో పెకిలించడానికి, సదరు వ్యక్తులను కటకటాల వెనక్కి నెట్టడానికి సింగరేణి యాజమాన్యం సంసిద్ధంగా ఉందని, సంస్థ పట్ల బాధ్యత గల కార్మికులు ఇందుకు సహకరించాలని, సమాచారం అందించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. అవినీతి అక్రమాలకు పాల్పడే వ్యక్తులు ఎవరైనా సరే, ఏ హోదాలో ఉన్న వదిలిపెట్టేది లేదని యాజమాన్యం స్పష్టం చేసింది. గతంలోనూ సింగరేణిలో అక్రమాలకు పాల్పడిన పలువురు ఉద్యోగులపై విచారణ జరిపి డిస్మిస్ చేసిన విషయాన్ని గుర్తుచేసింది. చట్టప్రకారం పలువురిపై చర్యలు కూడా తీసుకున్నట్లు వెల్లడించింది. ఇకముందు కూడా పారదర్శక సింగరేణి కోసం అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసింది. సింగరేణి సంస్థను అవినీతి రహిత కంపెనీగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. కొత్తగూడెం విజిలెన్స్ శాఖ ఫోన్ నంబర్ 94911 44104 కు గాని, విజిలెన్స్ శాఖ మెయిల్ ఐడికు

